క్లుప్తంగా

నియామక పత్రాల అందజేత



ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులతో ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: ఎన్నికల నిర్వహణకు నియమితులైన ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు నర్సీపట్నం నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో హెచ్.వి.జయరాం ఆదివారం నియామక పత్రాలను అందజేశారు. ఎన్నికల విధులను చిత్తశుద్ధితో నిర్వర్తించాలని ఆర్డీవో అధికారులకు సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా ప్రిసైడింగ్ అధికారులు పని చేయాలన్నారు. సమాచారం ఇవ్వటంలో జాప్యం చేయొద్దన్నారు. ఎన్నికల విధులకు విధిగా హాజరు కావాలని సూచించారు.

నేడు జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందెం

బుచ్చెయ్యపేట: కేపీ అగ్రహారంలో జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పందెం సోమవారం నిర్వహించనున్నట్లు సర్పంచ్ గోపిశెట్టి శ్రీను తెలిపారు. నూకాలతల్లి పండగ పందర్భంగా మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఇక్కడ ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఇందులో మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన ఎడ్లబళ్ల యజమానులకు వరుసగా రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు ఉత్సవ కమిటీ, గ్రామ పెద్దల సమక్షంలో అందిస్తామన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పరామర్శ



శ్రీను కుటుంబ సభ్యులతో అనురాధ

చీడికాడ: సి.డి.సి చైర్మన్ సుంకర శ్రీనివాసరావు, ఆయన కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ మాడుగుల అభ్యర్థి ఈర్లె అనురాధ ఆదివారం మధ్యాహ్నం పరామర్శించారు. ఖండివరంలో ఇటీవల శ్రీను భార్య మృతి చెందిన విషయం విదితమే. ఈ మేరకు శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

లక్ష్మీపురానికి తారురోడ్డు

- రూ.6.50 కోట్లతో నిర్మాణం పూర్తి



లక్ష్మీపురం గ్రామానికి వేసిన రోడ్డు

మాడుగుల: తాటిపర్తి పంచాయతీ లక్ష్మీపురం గ్రామానికి గతంలో రహదారి సౌకర్యం లేదు. దీంతో జ్వరమొచ్చినా జబ్బొచ్చినా ఇక్కట్లు పడేవారు. దశాబ్దాలుగా గత పాలకుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో గడపగడపకు కార్యక్రమంలో భాగంగా గ్రామానికి వచ్చిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన నెల తిరగకముందే ఏఐఐబీ నుంచి రూ.6.50 కోట్లు మంజూరు చేశారు. ఈ మొత్తంతో రోడ్డు పనులు పూర్తి చేశారు. దీంతో డిప్యూటీ సీఎం బూడికి రుణపడి ఉంటామని ఆనందం వ్యక్తం చేశారు.

గిరిజన గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు



వృద్ధులను పరీక్షిస్తున్న వైద్యులు

మాడుగుల రూరల్: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వి.వి.అగ్రహారం సృజనవాణి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. చీడికాడ మండలం కోనాం పంచాయతీ గుడివాడ, వాకపల్లి, జాజులపాలెం, పనసగెడ్డ, ఆవాస గ్రామాల్లో గిరిజనులకు, అప్పలరాజుపురంలో లలితాదేవి వృద్ధాశ్రమంలో 62 మందికి వైద్య సేవలందించారు. వైద్యాధికారి మానస ఆధ్వర్యంలో బీపీ, సుగర్, తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. బాలింతలకు లుపిన్ ఫార్మా కంపెనీ వారి సహకారంతో వైద్య సేవలు అందించారు. సృజనవాణి సంస్థ సభ్యులు ఉమాశంకర్, మురళీ, లుపిన్ ఫార్మా మేనేజర్ వెంకటేష్ పాల్గొన్నారు.

నేడు కొత్త అమావాస్య జాతర

- గ్రామాల్లో నూకాంబిక పండగకు ఏర్పాట్లు
- ఎ.కొత్తపల్లిలో జిల్లా స్థాయి గుర్రపు పోటీలు



కె.జె.పురం చెరకు కాటా ఆవరణలో నూకాలమ్మ అమ్మవారు



మామిడిపల్లిలో ప్రత్యేక అలంకరణలో నూకాంబిక అమ్మవారు



ప్రత్యేక విద్యుత్ అలంకరణతో ఉత్సవాలకు ముస్తాబైన చోడవరం నూకాలమ్మ ఆలయం

చోడవరం: అమ్మలగన్న అమ్మ...కోర్కెలు తీర్చే చోడవరం నూకాలమ్మ అమ్మవారి కొత్త అమావాస్య జాతర ఈ నెల 8వ తేదీ అంగరంగ వైభవంగా జరిపేందుకు భారీ ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా నూకాలమ్మ జాతర నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నారు. అదేవిధంగా ఈనెల 8 నుంచి మే 8వ తేదీ వరకు నెల రోజుల పాటు గంథఅమావాస్య పండగ వరకు జాతర మహోత్సవం జరుగుతుంది. రోజూ అమ్మవారికి ప్రత్యేక పూజలతోపాటు గరగల ఉత్సవం, మొక్కులు చెల్లించుకునేందుకు ఆలయ ప్రాంగణంలో అన్ని ఏర్పాట్లు చేశారు. చోడవరంలో అమ్మవారి ఆలయాన్ని రంగులతో సిద్ధం చేశారు. ఆలయ ప్రాంగణమంతా ప్రత్యేక విద్యుత్ సెట్లతో అలంకరణ చేశారు. ఉత్సవాల్లో రోజూ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

దేవరాపల్లి: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో నూకాలమ్మ పండగను సోమవారం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎ. కొత్తపల్లి, మామిడిపల్లి, ఎం. అలమండ, దేవరాపల్లి, బేతపూడి, కాశీపురం, తదితర గ్రామాల్లో ఇప్పటికే ఆలయాలను ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. నూకాంబిక జాతరను పురస్కరించుకొని ఎ. కొత్తపల్లిలో మధ్యాహ్నం నుంచి జిల్లా స్థాయి గుర్రపు పరుగు పోటీలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు వరుసగా రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేల చొప్పున బహుమతులను దాతలు, గ్రామ పెద్దల సమక్షంలో అందజేస్తామన్నారు. ఆలయ ఆవరణలో మధ్యాహ్నం అన్నసమారాధన, మహిళల కోలాట ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. రాత్రికి గయోపాఖ్యానం, రామాంజనేయ యుద్ధం , సత్య హరిశ్చంద్ర పౌరాణిక పద్య నాటక ప్రదర్శనను నిర్వహించనున్నట్లు తెలిపారు.

మాడుగుల రూరల్: కోర్కెలు తీర్చే కల్పవల్లి నూకాలమ్మ తల్లి కొత్త అమావాస్య పండగ సోమవారం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. కె.జె.పురం చెరకు కాటా ఆవరణలో నూకాలమ్మ ఆలయంలో సోమవారం నుంచి ప్రత్యేక పూజలు, ఘటాలు ఊరేగింపు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా స్థానిక మోదమాంబ ఆటో వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేపట్టనున్నారు. అమ్మవారికి స్థానిక రెబల్ టాలెంట్ యూత్ సహకారంతో 12 తులాల వెండి మంగళసూత్రం బహూకరించారని నూకాంబిక అమ్మ గురుమాత శీలం దేముళ్లు తెలిపారు. ముకుందపురం, మాడుగుల, వీరనారాయణం, తదితర గ్రామాల్లో ఈ పండగను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆయా గ్రామాల పెద్దలు తెలిపారు.

గొలుగొండ: లింగంపేట నూకాలమ్మతల్లి జాతర ప్రారంభమైంది. ఈ ప్రాంత ప్రజల ఇలవేల్పుగా అమ్మవారి తీర్థ మహోత్సవాలు వారం రోజుల పాటు కమిటీ, దేవదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఆదివారం తొలిపూజా కార్యక్రమం లింగంపేట, గొలుగొండలో ప్రారంభించారు. సోమవారం చుట్టుపక్కల 30 గ్రామాల్లో పండగలు చేస్తారు. వారం రోజులపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

వేడుకగా నూకాలమ్మ పండగ

నాతవరం: జిల్లేడుపూడి పంచాయతీలో బుచ్చెంపేట నూకాలమ్మ తల్లి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. కొత్త అమావాస్య పండగ సందర్భంగా అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి, విశాఖపట్నం జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు రావడంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసింది. ట్రాఫిక్ అంతరాయం లేకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా చెర్లోపాలెం, మర్రిపాలెం, డి.యర్రవరం, నాతవరం, ఎం.బి.పట్నం, మాధవనగరం గ్రామాల్లో నూకాలమ్మ తల్లి పండగను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ముందుగా వారం రోజుల పాటు ఆయా గ్రామాల్లో అమ్మవారి గరగలు ఉత్సవాలు నిర్వహించారు. నాతవరం, మర్రిపాలెం గ్రామాల్లో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో పండగకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



ఎం. అలమండలో ముస్తాబైన నూకాంబిక అమ్మవారి ఆలయం

సరుగుడు జలపాతం వద్ద సందడి



జలపాతం వద్ద సందర్శకుల జలకాలాట

నాతవరం: సరుగుడు జలపాతం వద్ద ఆదివారం సందర్శకుల తాకిడి సందడి నెలకొంది. ఇక్కడ ఎత్తయిన రెండు కొండల మధ్యలోంచి ప్రవహించే నీటిలో జలకాటాలు ఆడేందుకు ఉత్సాహం చూపారు. వేసవిలోనూ జలపాతం వద్ద నీటి ప్రవాహం ఏమాత్రం తగ్గలేదు. పది, ఇంటర్ విద్యార్థులకు పరీక్షలు ముగియడంతో చుట్టుపక్కల వారుతోపాటు దూర ప్రాంతాల నుంచి తరలివచ్చారు. జలపాతం వద్ద వారంతా కేరింతలతో సందడి చేశారు.

ఎన్నికల కోడ్ అతిక్రమిస్తే చర్యలు



సిబ్బందికి సూచనలిస్తున్న అధికారి నాగమోహన్‌రావు

రోలుగుంట: ఎన్నికల కోడ్ అతిక్రమిస్తే ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తప్పవని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి నాగమోహన్‌రావు తెలిపారు. ఆదివారం ఆయన తన టీం (వీడియో గ్రాఫర్, ఆర్మ్‌డ్ గన్‌మెన్, పోలీస్)తో కలసి గ్రామాల్లో కలియ తిరిగారు. శిలాఫలకాలకు, నాయకుల విగ్రహాలకు వేసిన ముసుగులను పరిశీలించారు. ఎన్నికల ప్రలోభాలపై ఆరా తీశారు. రోలుగుంటలో మాట్లాడుతూ కోడ్ ముగిసే వరకూ రాజకీయ వర్గాలపై నిరంతర నిఘా ఉంచాలన్నారు. వాహనదారుల వద్ద పత్రాలు ఉండాలని, లేకుంటే అనుమానాస్పదంగా సీజ్ చేయడం తప్పదన్నారు.

గెలుపే ధ్యేయంగా ప్రతి కార్యకర్త పనిచేయాలి

పార్టీ శ్రేణుల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ

చీడికాడ: గెలుపే ధ్యేయంగా ప్రతి కార్యకర్త, నాయకుడు పని చేయాలని మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు అప్పలరాజుపురంలో ప్రారంభించిన పార్టీ శ్రేణుల పరిచయ కార్యక్రమం ఎల్.బి.పట్నం, ఖండివరం, వి.బి.పేట, శిరిజాం, కోనాం, మంచాల, చీడికాడ, జి.కొత్తపల్లి, ఎ.అగ్రహారం, బైలపూడి, జైతవరం, బి.సింగవరం, దిబ్బపాలెం, దండిసురవరం, తునివలస, వరాహాపురం గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని ప్రజలకు గుర్తు చేయాలన్నారు. గెలుపే ధ్యేయంగా ప్రతి కార్యకర్త, నాయకుడు ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కురచా జయమ్మ, జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాం, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, యూత్ అధ్యక్షుడు స్వామినాయుడు, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, ముఖ్య నేతలు, అనుబంధ సంఘాల నేతలు పాల్గొన్నారు.



మంచాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ

కరాటే విద్యార్థులకు బెల్ట్స్ ప్రదానం



బెల్ట్స్ పొందిన విద్యార్థులతో ముఖ్య అతిథులు

నర్సీపట్నం: ఆర్సీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ కరాటే విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. ఇందులో ఎంపికైన విద్యార్థులకు గ్రేడింగ్స్ ఇచ్చారు. ఎల్లో బెల్ట్ -11 మందికి, ఆరెంజ్ బెల్ట్ -4, గ్రీన్ బెల్ట్ -3, బ్రౌన్ -1, ప్యూర్‌పల్ బెల్ట్ -1 చొప్పున కేటాయించారు. బెల్ట్స్, సర్టిఫికెట్లను కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వెలగా నారాయణ రావు, బంగార్రాజు విద్యార్థులకు ప్రధానం చేశారు. కార్యక్రమంలో కోచ్ రామోజీ ప్రసాద్, నాగజ్యోతి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అనకాపల్లి ఎంపీ అభ్యర్థికి సంపూర్ణ మద్దతు

దేవరాపల్లి: వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడుకు రోజు రోజుకు ప్రజా మద్దతు పెరుగుతోంది. నిత్యం ప్రజా సేవలోనే ఉంటున్న ఆయనకు పలు సామాజిక వర్గాల నేతలు, ప్రజలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు స్వచ్ఛందంగా మద్దతు ప్రకటిస్తున్నారు. అనకాపల్లి, బుచ్చెయ్యపేట, దేవరాపల్లి మండలాలకు చెందిన నాయకులు, ప్రజలు ఆదివారం తారువలో కలిసి సంపూర్ణ మద్దతు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రజా బలం ముందు, ప్రతిపక్షాల ధన బలం నిలువలేదని వారంతా స్పష్టం చేశారు. స్థానిక సమస్యల పట్ల పూర్తి అవగాహన కలిగిన ముత్యాలనాయుడును గెలిపించేందుకు అనకాపల్లి పార్లమెంట్ ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. అప్పన్నపాలెం సర్పంచ్ రమేష్, కందిపూడి మాజీ సర్పంచ్ నాయుడు, నాయకుడు పి. శ్రీను, రైవాడ నాయకుడు చల్లా నాయుడు, మాజీ ఎంపీటీసీ ఉగ్గిన దేముళ్లు, జీటీవీ సత్యనారాయణ, యువకులు పాల్గొన్నారు.



డిప్యూటీ సీఎం బూడికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న పెందుర్తి మండల నాయకులు

నూకాంబిక విగ్రహావిష్కరణకు ఆహ్వానం

పెందుర్తి మండలం కోటనరవ గ్రామం, 88వ వార్డులో గౌరీ వినాయక యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం జరిగే నూకాంబిక జీర్ణోద్ధరణ సహిత విగ్రహావిష్కరణ మహోత్సవానికి డిప్యూటీ సీఎం బూడిని సంఘ నాయకులు ఆహ్వానించారు. ఆయన్ను సత్కరించి ఆహ్వాన పత్రిక అందజేశారు.

భజన బృందాల గురువులకు ఘన సన్మానం





హిమాలయ స్వామి నుంచి సన్మానం పొందుతున్న శ్రీనివాసరావు, కోట్యాడ సన్యాసినాయుడు

మాడుగుల రూరల్: అన్నమయ్య వర్థంతి సందర్భంగా ఆదివారం పల్నాడు జిల్లా వినుకొండలో రాష్ట్ర స్థాయి భజన బృందాల గురువులకు ఘన సన్మానం చేశారు. వీరితోపాటు మండలంలో వి.వి. అగ్రహారం గ్రామానికి చెందిన మోదకొండమ్మ భజన బృందం గురువు పాలకుర్తి శ్రీనివాసరావు తోపాటు దేవరాపల్లి మండలం వాకపల్లికి చెందిన భజన గురువులు కోట్యాడ సన్యాసినాయుడు, గెంజి సత్తిబాబు సన్మానం పొందారు. వినుకొండ శాంతి ఆశ్రమ ట్రస్టు, తిరుపతి అన్నమయ్య జానపద కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో వితంరాజుపల్లి సాయి బృందావనం(చిన్న షిర్డీ)లో ఈ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా సనాతన ధర్మ పరిరక్షణ కోసం అంతరించిపోతున్న కళలను పునరుద్ధరించడానికి కృషి చేస్తున్న భజన కళాకారుల బృందాల గురువులకు హిమాలయ గురువు, అన్నమయ్య జానపద కళాక్షేత్ర పీఠాధిపతి విజయశంకర స్వామివారు ఘనంగా సత్కరించారు.

తాగునీటి సరఫరాకు ప్రత్యేక కార్యాచరణ

- రూ.30 లక్షలతో వేసవి ప్రణాళిక సిద్ధం
- నర్సీపట్నం మున్సిపల్ ప్రజలకు తీరనున్న కష్టాలు



ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా



తాగునీటి కుళాయిల వద్ద మహిళలు



దుగ్గాడ ఊటబావుల వద్ద నీటి నిల్వలు

నర్సీపట్నం: ప్రజల కనీస అవసరాల్లో తాగునీరు కల్పన ప్రధానమైంది. దీని వినియోగం ఏటా పెరుగుతూనే ఉంది. దీనికితోడు మున్సిపాలిటీ జనాభా గతంలో కంటే అమాంతంగా పెరిగింది. ఈ నేపథ్యంలో వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ముమ్మందు ఎండల తీవ్రత మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉండటంతో రూ.29.50 లక్షలతో వేసవి ప్రణాళిక సిద్ధం చేశారు. ట్యాంకర్లకు రూ.8 లక్షలు, దుగ్గాడ ప్రాజెక్టు వద్ద నీటిని నిల్వ చేసేందుకు ఇసుక బస్తాలు రూ.2.30 లక్షలు, వాటర్ హెడ్ ట్యాంక్‌లు మెయింటెనెన్స్‌కు రూ.4.20 లక్షలు, పంపుషెట్లు హెడ్ వాటర్ వర్క్స్‌కు రూ.5 లక్షలు, మెయింటినెన్స్ మెటీరియల్ కొనుగోలుకు రూ.5 లక్షలు, వాటర్ సప్లయి పైపులైన్ మెటీరియల్‌కు రూ.5 లక్షల చొప్పున కేటాయించారు. ప్రధానంగా వరాహనదిపై దుగ్గాడ ప్రాజెక్టు ద్వారా మున్సిపల్ ప్రజలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. వేసవి ప్రారంభంలోనే ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. అప్పట్లో 30 వేల జనాభా తాగునీటి అవసరాలను తీర్చేందుకు ఈ ప్రాజెక్టును నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించారు. ప్రస్తుతం పట్టణ జనాభా 75 వేలకు పెరిగింది. ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు రోజూ గంట పాటు నీటిని సరఫరా చేస్తున్నారు. నీటి నిల్వను పెంచేందుకు దుగ్గాడ ఊటబావుల వద్ద ఇసుక బస్తాలు, సిమెంట్ దిమ్మలు అడ్డంగా వేశారు. పెదబొడ్డేపల్లి థెరిసా కాలనీ, అయ్యన్నకాలనీ, కృష్ణాపురం ప్రాంతాలకు ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. అవసరం మేరకు రెండు రోజుల నుంచి మరో రెండు ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరాకు అధికారులు చర్యలు చేపట్టారు.

రోజూ గంటకుపైగా నీటి సరఫరా

పట్టణంలో 75 వేల మంది జనాభా నివసిస్తున్నారు. వీరిలో సగటు మనిషికి రోజూ 80 లీటర్ల చొప్పున తాగునీటిని సరఫరా చేయాల్సి ఉంది. ఈ విధంగా రోజుకు 6.0 ఎం.ఎల్.టి (మిలియన్ లీటర్లు) నీటిని సరఫరా చేయాల్సి ఉండగా, ప్రస్తుతం 3.25 ఎం.ఎల్.టి నీటిని సరఫరా చేస్తున్నారు. రోజుకు ఒక్కో వ్యక్తికి 40 లీటర్లను అందిస్తున్నారు. 28 వార్డుల్లో 1,200 పబ్లిక్ కుళాయిలు, 320 చేతిపంపులు ఉన్నాయి. కొన్ని ప్రాంతాలకు ఉదయం, మరికొన్ని ప్రాంతాలకు సాయంత్రం వేళల్లో గంటకు పైగా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతానికి తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేదని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. చేతిపంపుల ద్వారా గృహ అవసరాలను తీర్చుకుంటున్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక ప్రణాళిక..



వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం. రూ.30 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ఈ నిధులతో పైపులైన్ల మరమ్మతులు, అదనంగా ట్యాంకర్ల ఏర్పాటు, మోటార్ల మరమ్మతులకు వినియోగిస్తాం . ప్రస్తుతానికి పట్టణంలో తాగునీటి సమస్య లేదు. ముమ్మందు ఎండల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉండటంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం. ఉత్తరవాహిని, దుగ్గాడ బోర్‌వెల్స్ వద్ద నీటి నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి. నీటి సమస్య ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తాం.

పూడి రవిబాబు,
కమిషనర్, నర్సీపట్నం మున్సిపాలిటీ

ఎండలు సలసల.. ప్రజల మలమల

- నిర్మానుష్యంగా మారిన బీఎన్‌రోడ్డు
- చోడవరంలో 40.5డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు



ఎండ తీవ్రతను తట్టుకోలేక గొడుగు నీడలో వెళ్తున్న యువకులు



నిర్మానుష్యంగా చోడవరం మెయిన్‌రోడ్డు

చోడవరం: రెండు రోజులుగా ఎండలు తీవ్రతంగా ఉండడంతోపాటు వడగాడ్పులు వీస్తున్నాయి. ఉదయం నుంచి భానుడి భగభగలతో జనం అల్లాడిపోతున్నారు. బయటకు రావాలంటే భయపడుతున్నారు. అత్యవసరంగా బయటకు వచ్చిన వారు ఎండవేడిమి నుంచి రక్షణ పొందేందుకు ముఖానికి ముసుగులు ధరిస్తున్నారు. ఆదివారం చోడవరంలో 40.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున ఎవరూ బయట తిరగవద్దని, నీడపట్టున ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

బుచ్చెయ్యపేట: భానుడు రోజురోజుకీ ఉగ్రరూపం దాల్చుతున్నాడు. మండలంలో ఆదివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఏకధాటిగా ఎండ కాసింది. దీంతో భీమునిపట్నం–నర్సీపట్నం ప్రధాన రోడ్డుతోపాటు కేబీ రోడ్డు, ఆర్టీ రోడ్డు జన సంచారం లేక నిర్మానుష్యంగా మారాయి. వడగాల్పులు, అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోయారు. చిన్నారులు, వృద్ధుల పాట్లు వర్ణనాతీతంగా మారాయి. వాహనదారులు ఎండ వేడిని తట్టుకోలేక టోపీలు, స్కార్ఫ్ ధరించి రాకపోకలు సాగించారు. పాదచారులు సైతం గొడుగు నీడలో తలదాచుకుని గమ్యస్థానాలకు చేరుకున్నారు. ఇళ్లపై ట్యాంకుల్లో నీరు వేడిగా పైపుల నుంచి రావడంతో గృహస్తులు అవస్థలు పడ్డారు.

గొబ్బూరులో 5 ఎకరాల జీడితోట దగ్ధం

- రూ.10 లక్షల ఆస్తి నష్టం

మాడుగుల రూరల్: జాలంపల్లి పంచాయతీ శివారు గొబ్బూరులో ఐదెకరాల జీడితోట దగ్ధమైంది. ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నీలపు అప్పయ్యమ్మ, పంది అప్పారావు, నదిలా లక్ష్మి, నీలపు ఎర్రయ్యలకు చెందిన జీడితోట కాలిపోవడంతో లబోదిబోమంటున్నారు. కాపు దశలో జీడి తోట దగ్ధం కావడంతో రూ.10 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లి ఉండవచ్చునని అంచనా.

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం



ఓటు హక్కు ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

దేవరాపల్లి: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటే వజ్రాయుధమని వెలుగు ఏపీఎం ఎస్. ప్రభాకర్ తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదివారం దేవరాపల్లి, కాశీపురం గ్రామాల్లో ఓటర్స్ ఎడ్యుకేషన్, ఎల్క్టోరల్ పార్టిసిపేషన్ వారి ఆధ్వర్యంలో ఓటు హక్కు ఆవశ్యకతపై కళాజాత ద్వారా అవగాహన కల్పించారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ పోలింగ్ రోజు ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలని సూచించారు. ఓటరు జాబితాలో పేర్లు తదితర వివరాల కోసం 1950 నంబర్‌ను సంప్రదించాలని ప్రజలకు వివరించారు. జలమే మూలం జగత్ సృష్టిలో అనే నినాదంతో నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని, తాగునీటి ఆవశ్యకతను వివరించారు. వెలుగు సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.